# శృంగారలహరి

"నీమీద మనసాయెరా! రేరాజ నన్ను కన్నార మన్నించరా....."

సుందరమూర్తి యింటికి వచ్చేసరికి వంటింట్లోంచి కమ్మని వాసనలతో వినిపిస్తున్న తీయని పాట యిది.

ఆ తన్మయంలో తన మాట, పిలుపు యిల్లాలికి వినిపించదని తానే వంటింట్లోకి వెళ్ళాడు.

సుభద్రమ్మగారు శ్రీవారి రాకను గమనించలేదు. ఆవిడ దృష్టి అంతా కంప్యూటర్ స్క్రీన్ మీద వుంది. అది చూసుకుంటూ కాగితం మీద ఏవో లెక్కలు వేస్తోంది.

అటువంటి పరిస్థితులలో ఆవిడను పలకరించడంకన్నా తెలివితక్కువ పని వేరే వుండదని యీ నలభై సంవత్సరాల సహచర్యంలో ఏనాడో కనిపెట్టాడు.

ఫ్లాస్క్‌లోని వేడి కాఫీ మగ్గులో పోసుకుని త్రాగుతూ ఆవిడ వంక చూస్తున్నాడు.

నిర్ణయించిన కాలంలో వంట పూర్తిచేసి, ఎలక్ట్రిక్ వోవెన్ తనంత తాను చల్లబడినా వండిన పదార్థం చల్లబడకుండా కాపాడుతోంది.

గోడగడియారంలోని రామచిలుక ఏడుసార్లు చిలుక పలుకులు పలికింది.

ఆవిడ తపస్సు భంగమయింది. ముఖంలో మందహాసం కనిపిస్తోంది.

భర్త వంక చూసి చిరునవ్వు నవ్వింది.

"ఎవ్వరి భవిష్యత్తు పరికిస్తున్నావు" అని ఆయన అడిగితే "నీ కథ నాకు తెలుసోయి....... అందాల నెలబాలుడా" అంటూ తువ్వాలు తీసుకుని స్నానం చెయ్యడానికి వెళ్ళింది.

ఆయన అద్దంలో తన ప్రతిబింబం వంక చూసుకున్నాడు. పేరుకు తగ్గట్టుగానే వున్నాడు. వయస్సు మీరినా వన్నె పసివాడలేదు. రూపు తరుగలేదు.

కాలం ఎంత మార్పు తీసుకు వచ్చింది. పెళ్ళినాటికి పిల్ల చదువుకున్నది..... మెట్రిక్యులేషన్' అని అంటే ఆడపిల్లకి అంత చదువు ఎందుకని అమ్మలక్కలు తమ అమూల్యాభిప్రాయాలు ప్రకటిస్తూ ఉద్యోగాలు చేస్తుందా, ఊళ్ళేలుతుందా అని సవాలు చేశారు.

అన్నింటికి సమాధానం తన మౌనం, తన యిల్లాలి చిరునవ్వు...

అమ్మాయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. అబ్బాయి ఉద్యోగం నిమిత్తం విదేశాలకు వెళ్ళాడు.

లంకంత యింట్లో తాము యిద్దరూ మిగిలారు.

ఆస్తి వ్యవహారాలు, వ్యాపార నిర్వహణలో తనకు క్షణం తీరిక లేదు.

అవిడకు అంతా తీరికే.

ఒకనాడు తను యింటికి వచ్చేసరికి "బి.ఏ. ప్యాసు అయ్యాను అంది."

ఆయనేం మాట్లాడలేదు... గుమ్మంలో వాడు గుమ్మంలోనే వెనక్కి తిరిగి బజారు వెళ్లి వచ్చాడు.

ఒక చిన్న పొట్లం తన చేతిలో పెడుతూ 'కంగ్రాట్యులేషన్స్' అని అన్నాడు. రాళ్ళు గాజులు! ఎర్రటి రాళ్ళు - మేలిమి బంగారంతో మిలమిలా మెరిసిపోతుంటే... ముఖం ఒక్క క్షణం కెంపు వన్నెకొచ్చింది. అంతలోనే చిరుకోపం వచ్చింది. భృకుటి ముడి పడింది.

"ఇంతేనా?" అని అంది.

తన చేతులతో స్వయంగా ఆ గాజులు ఆవిడ చేతులకు తొడిగాడు. ఆవిడని దగ్గరకు తీసుకుంటూ "ఐ లవ్యూ" అని అన్నాడు.

తనని అల్లుకుపోతూ 'థ్యాంక్యూ' అని అంది.

సంవత్సరం తిరగకుండానే రవీంద్ర భారతి సంగీత కార్యక్రమానికి బలవంతంగా తీసుకు వెళ్ళింది. తనని బుద్ధిమంతుడి లాగా ఒక చోట కూర్చోబెట్టి- ఆవిడ స్టేజి మీదకు వెళ్ళిపోయింది.

ఎవ్వరో భద్రమహిళతో కలసి తను పాడటమే కాకుండా వీణ కూడా వాయించింది.

ఆశ్చర్యం వేసింది. రాష్ట్ర గవర్నర్‌గారు మెమొంటోలు ఇస్తూ వుంటే గర్వం కూడా వేసింది.

మరుసటి సంవత్సరం కంప్యూటర్‌లో డిప్లొమా సంపాదించింది... 21వ శతాబ్దంలోకి అడుగు పెడుతూ కూడా సాంప్రదాయం అనుష్టానం- అంతిరేక్షణ- యోగాభ్యాసం- ఆధ్యాత్మిక చింతనలో కూడా అంత ప్రగతి సాధించింది.

రోజూ సాయంకాలం ఏదో ఆలయంలో ఆధ్యాత్మిక విషయాలను గురించి చక్కటి ఉపన్యాసాలు ఇస్తోందని తను పత్రికలో చదివాడు.

చిత్రలేఖనం- నాట్యం కూడా ఈ మధ్య నేర్చుకుండిందేమో తనకు తెలియదు. ఇప్పుడు ఆవిడ మనస్సు ఆకట్టుకున్న విషయం జ్యోతిష్యం.

మల్లెపూవులాంటి చీర... మల్లెపువ్వుల దండ- మధ్యలో ఒక గులాబి- చేతిలో ఒక కాగితాల దొంతర- కంప్యూటర్ ప్రింట్ అవుట్సు.

"ఈ రోజు ఎవ్వరి భవిష్యత్తులోకి తొంగిచూస్తున్నావు?" అని అడిగాడు.

ఆవిడ కొంటెగా తన వంక చూస్తూ "ఈనాటి నుండి మీపేరు సుందర కృష్ణమూర్తి."

"అని ఎందుకని?"

"రాముడు ఏకపత్నీవ్రతుడు. మీరు కాదు."

"అని ఎవరంటున్నారు?"

"మీ జాతకం..."

"ఏముంటుంది నా జాతకం?"

"మీకు నలుగురు భార్యలని- నేను మీ నాలుగో భార్యనని. మీకు ఇరవై రెండవ సంవత్సరంలో మీ మొదటి భార్య వల్ల స్త్రీ సంతానం. రెండు, మూడుకు సంతానం లేదు. నాలుగు - ఒక ఆడపిల్ల, మగపిల్లవాడు."

సుందర్రామూర్తికి మొట్టమొదటి సారిగా భార్యమీద నిజంగానే కోపం వచ్చింది.

"ఈ విషయాలు తమకు ఎల్లా తెలుసు?"

"నేను చదివిన జ్యోతిష్య శాస్త్రం దానిని గురించి కంప్యూటర్ కోసం నేను కొన్న సాఫ్ట్‌వేర్ కంప్యూటర్ ద్వారా మీ జాతకం వేసాను. అబద్ధం చెప్పడానికి అదేం మనిషి కాదుగా - నూటికి నూరు పాళ్లు నిజం చెప్పింది."

"వాళ్ళ పేర్లు, అడ్రస్‌లు - ఇప్పుడు వాళ్ళు ఏం చేస్తున్నారో కూడా మీ శాస్త్రం చెప్పిందా?"

"తను చెప్పదు - కాని మీచేత చెప్పిస్తుంది."

అయనేం మాట్లాడలేదు. సరాసరి అద్దాల బీరువా దగ్గరకు వెళ్ళాడు. ఒక లార్జ్ పెగ్ షివాజ్ రీగల్ గ్లాసులో పోసుకుని, రెండు ఐస్ క్యూబ్‌లు, రవ్వంత సోడా వేసుకుని డ్రాయింగ్ రూములోకి వచ్చి కూర్చున్నాడు.

గల గలా నవ్వుతూ యిల్లాలు వచ్చింది ప్లేటులో పొటాటో చిప్స్ బల్లపై పెట్టి వున్నాయి.

ఆవిడ వంక చూశాడు. ఆయన వంక గంభీరంగా చూస్తూ 'సెలబ్రేషన్' అని అంది.

"ఇంతకాలం నాకు ఒక భార్య, ఇద్దరు పిల్లలు అన్న అపోహలో వున్నాను. తమ దయ వల్ల నాకు యీనాడు నలుగురు భార్యలు, ముగ్గురు పిల్లలు- ఈ సంతోషం భరించలేక మరచిపోవడం కోసం ఆన్‌రాక్స్ త్రాగుతున్నాను."

ఆవిడ దగ్గరకు వస్తూ - "చిన్న పిల్లవాడిలాగ ఏమిటీ మాటలు?"

"స్త్రీలకే కాదు పురుషులకు కూడా మంచిశీలము చాలా అవసరమని నేను నమ్మాను. నా జీవితాన్ని యింతవరకు అలాగే గడుపుకుంటూ వచ్చాను. కాని ఈనాడు నీ శాస్త్రం నన్నొక స్త్రీలోలుడుగా, వ్యభిచారిగా చిత్రించింది. నేను వుండి కూడా నా సంతానంలో ఒకరిపట్ల నేను బాధ్యతారహితంగా ప్రవర్తించినట్టుగా భావిస్తూవుంటే నేరమే జరగనప్పుడు, ఒక అమాయకుడిని దోషిని చేయడం నీకు న్యాయం కాదు...."

"శాలువ తెస్తాను వుండండి, ఇటువంటి డైలాగులు చెప్పేటప్పుడు చేతిలో గ్లాసు, ఒంటిమీద జారిపోతున్న శాలువా, గడ్డం మాసిన ముఖం, ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వగైరా వున్నప్పుడు ఆడియన్స్ మీద మంచి ఎఫెక్ట్ వుంటుంది."

అతగాడి ఆవేదన చూడగానే ఆవిడకి పెద్దపెట్టున నవ్వు వచ్చింది. ఆ నవ్వు చూడగానే ఆయనకి ఆగ్రహం వచ్చింది.

"ఎందుకు నవ్వుతావు?" అంటూ గట్టిగానే అడిగాడు.

"మీకు తెలుగు భాష సరిగ్గా రానందుకు..."

"దీంట్లో భాషతో పనేంటో నాకు తెలియటం లేదు. పగలంతా కష్టపడి యింటికి వస్తే ఒక ఆలనా లేదు, పాలనా లేదు సరి కదా, నేను మీకు నాలుగో భార్యను అంటూ అభాండం వేస్తుంటే మనస్సుకి ఎంత బాధగా వుంటుంది."

"మీ బాధలు తొలగాలంటే ఒకటే మార్గం"

"ఏమిటది?"

"రోజూ ఒక గంట నా దగ్గర కూర్చోండి."

"కూర్చుని..."

"అల్లరి చిల్లర పనులు చెయ్యకుండా బుద్ధిమంతుడిలాగా నా దగ్గర చదువు నేర్చుకోండి."

"ఈ వయస్సులో పలకా, బలపం తెచ్చుకోనా?"

"తెచ్చుకుంటే మంచిదే. పోనీలేండి - కాగితం, కలంతోనే సర్దుకుపోదాం.'

"సుభద్రా, ఈ మధ్య నీ మాటలు నాకేం అర్థం కావడంలేదు. తెలియకుండా ఏవో అడ్డుగోడలు మనమధ్య నిలబడుతున్నాయేమోనని నాకు అనిపిస్తోంది.'

ఆయన వంక చిరునవ్వుగా చూస్తూ - "అడ్డుగోడలు లేవు - ముళ్ళ కంచెలు లేవు. పద ప్రయోగంలోనే మన యిబ్బందులన్నీ..."

"సుభద్రా ఇది అసలే ఆడిట్లు, ఇన్‌కమ్ టాక్సులు, డీవాల్యుయేషన్‌ల భయంకర సమయం. నాదల్లా ఒకటే మనవి. ఆలకిస్తావా?"

"సావధానంగా వున్నాను. సెలవివ్వండి."

"నువ్వు ఇతరులతో ఏ తీరున మాట్లాడినా నాకేం బాధలేదు. నాతో మాత్రం తేలిక మాటలతో - 'బాల', 'చందమామ' శైలిలో మాట్లాడు. నేను అంతకంటె ఏమీ కోరడం లేదు.

భర్తవంక చూస్తూంటే ఆవిడ మొఖంలో పదహారు వసంతాల వెన్నెల కనిపించింది. కనుసన్నల నుంచి కొంటెతనం తొంగి చూసింది.

"అంతకంటె మీరేం కోరుకోకపోతే నా మనస్సు తపించిపోతుంది. ఈ వలపుల విరజాజి శిలపై రాలిపోతుంది... సరస సరాగాల జీవితం అడవిన కాచిన వెన్నెలవుతుంది" అని అంటూంటే ఆవిడ కంఠం గద్గదమైపోయింది.

ఆయన మనస్సు ఆనందంతో నిండిపోయింది. కాలం నిలిచి పోయింది.

"సుభద్రా", అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

"ఈ దృశ్యం చూచిన పడుచు జంట పక పకా నవ్వితే..."

"నవ్వితే నవ్వేరు నాకేటి సిగ్గు" అంటూ ఆయన భుజం మీద తలవాల్చింది.

అంతలోనే తెప్పరిల్లుకుని - రవ్వంత దూరమవుతూ "వేళ కాని వేళలో ఏమిటి యీ అభావ చేష్టలు?" అని అంది. ఆయన ముఖం కూడా కెంపు వన్నెకొచ్చింది.

"మన జీవితాలలోకి మళ్ళీ వసంత మొచ్చినట్టుంది" అని అన్నాడు.

"చాలా దూరముంది... ప్రస్తుతం హేమంతంలో వున్నాము. శిశిరం కూడా గడవాలి కదా... మళ్ళీ వసంతం రావడానికి....

రోడ్డుమీద గందరగోళంగా వెడుతున్న "లారీ" సుఖస్వప్నాలని కరిగించి వేసింది.

"నువ్వు నాకు నాలుగో భార్యవి కాదు - నా ధర్మపత్నివి - నేను ఏకపత్నీ వ్రతుడిని సుభద్రా."

"భరించేవాడు భర్త - భరించబడేది భార్య. సంసారం కోసం - సంతానం కోసం వివాహం చేసుకున్న వనిత పెండ్లాము. ప్రేమించువాడు పెనిమిటి. తన మగసిరితో మెప్పించే వాడు మగడు... తృతీయ పురుషార్థం. పెనిమిటి పెండ్లాముల మధ్యనే శృంగార లహరి. భరించేవారికి భరించబడేవారి మధ్య యీ బంధం వుండాలనే నిబంధన లేదు...."

"సుభద్ర ప్లీజ్...."

"ప్రార్థిస్తున్నారుగా - ఉపన్యాసం ఆపేస్తాను. స్నానం చేసి రండి."

"స్నానం చేసివస్తే..."

"మనసంతా కూర్చి పెట్టిన గుత్తి వంకాయ కూరతో విందు భోజనం పెడతాను."

"తరువాత?"

"ఎక్కడి దొంగలు అక్కడే. గుప్‌చుప్!!"

"అంతేనా?"

"అంతే..."

వ్యాపారంతో సతమతమయ్యే మనస్సు, సాహిత్యాన్ని మరిచి పోలేదు.

"ఏదో సాకుగా - ఎవరికి వారే
ఎడమై పెడమోమైతే
వెంపరలాడే పున్నమితో
వేగేదెల్లా తెల్లవారేదెల్లా?" అంటూ ఇల్లా లిపి సవాలు చేశాడు!!

"మిగతా ముగ్గురు రాణుల వైనం తెలిపితేనే - ముచ్చట తీర్చేది..."

"ఆ రాణులు ఎవరో - వారి కథ ఏమిటో - విక్రమార్కుడిని భేతాలుడిని అడగనా? లేకపోతే - ఊరికి ఉత్తరాన జడలమర్రి క్రింద కూర్చున్న బాబాని ప్రశ్న అడగనా? అంజనం వేసి చూడనా?"

"అంత శ్రమ ఏమి పడనక్కర్లేదు. వర్తమానం విస్మరించి గతంలోకి తొంగి చూడండి. చిక్కు ప్రశ్న - ఎండ తగిలిన మంచులాగా విడిపోతుంది."

రాత్రి అంతా వెయ్యి ఆలోచనలతో గడిచిపోయింది. చీకటి గడిచి వెలుగు వచ్చే సరికి - మగత నిద్దర వదిలి - మనస్సు తేలిక అయింది.

వంట యింట్లో కాఫీ కలుపుతున్న యిల్లాలి దగ్గరకు వెళ్లి - "చిక్కు ప్రశ్నకు సమాధానం దొరికింది" అని అన్నాడు.

ఆవిడ ముఖంలో ఎంతో ఆనందం - గర్వం కనిపిస్తోంది.

"అమ్మయ్య! శాస్త్రమే గెలిచింది! ఆ చిన్నారుల ఊర్లు, పేర్లు గుర్తుకు వచ్చాయా కృష్ణపరమాత్మా?"

"ఇప్పటికీ నేను రాముడినే. నా వ్రతం చెడలేదు. నువ్వు ఓడిపోలేదు!"

"అయితే నా తరుపున యింకో కప్పు చిక్కటి కాఫీ తాగండి - ఆ తరువాత తీరికగా అరేబియన్ నైట్స్ కథలు చెప్పండి."

'కథ చెప్పే కాఫీ తాగుతా!"

"ఒక్క క్షణం ఆగండి. శౌనకాది మునులని - ఇతర ఋషులని పిలుచుకుని వస్తాను. వాళ్లు కూడా వింటారు."

"వాళ్ళని ప్రత్యేకంగా పిలవనక్కర్లేదు. వాళ్ళు చిరంజీవులు, సర్వశక్తి సంపన్నులు కదా. ఇవన్నీ వాళ్ళకు దివ్యదృష్టివల్ల తెలుస్తాయి..."

చెప్పండి సావధానంగా వున్నాను."

"కష్టంలో, సుఖంలో, నష్టంలో, లాభంలో విడిచిపెట్టకుండా భరిస్తున్న నా వ్యాపారం - నా మూడవ భార్య, దానికి మాటా మంతి లేకపోయినా దాని యందు ఎంతో మమకారం పెంచుకున్నా...."

"ద్వితీయం!"

"అన్నీ ఫస్ట్ ర్యాంకులు తెచ్చుకుంటూ - డబ్బు యిబ్బందులవల్ల సీటు వచ్చి కూడా, డాక్టరు కాలేమోనని బాధపడుతున్న - ఒక పేద విద్యార్థిని - చదువు కోసం మెరిట్ స్కాలర్‌షిప్ అనే పేరుతో ఎమ్.ఎస్. పూర్తి అయ్యేదాకా ఖర్చులన్నీ భరించాను. ఆవిడకు నేనెవరో తెలియదు. నేననే మనిషిని ఉన్నానని కూడా తెలియదు."

"ఇప్పుడావిడ ఎక్కడ వుంది?"

"అమెరికాలో!"

"ఇంత మంచి పనిచేస్తూ - నాతో ఎందుకు చెప్పలేదు?"

"విద్యాదానం ఉత్తమ దానమని చేశాను. గుప్తదానం మహాదానం అని పెద్దలు అన్నారు కాబట్టి - ఆ విషయం ఎవ్వరితోను ప్రస్తావించలేదు..."

"పట్టపురాణి?"

"పట్టపురాణీకాదు - ప్రథమ రాణీ కాదు... అపనిందల పాలవుతాననే

భయం వేసినా, వెయ్యి అబద్ధాలు చెప్పలేదు కాని, ఒక్క అబద్ధం చెప్పి ఒక పసిపాప భవిష్యత్తుకు పూలబాట వేశాను...''

"ఎలా?''

"మా బ్యాంకులో ఒక అమ్మాయి ఉండేది. కాళ్లకు మట్టెలు, మెళ్ళో మంగళ సూత్రం - పావలా కాసంత బొట్టు, పెద్ద యింటి ఆడపడుచుల హుందాతనం- బంగారం బొమ్మలాంటి నాలుగు సంవత్సరాల ఆడపిల్ల.... ఇంట్లో ఒక ముసలి పని మనిషి, కట్టుకున్న వాడు ఏనాడు నా కంట కనపడలేదు; మా యింటి ఎదురుగా వున్న మేడ మీద వుండేది. చాలా మర్యాద గల వ్యక్తి - నా కంటె వయస్సులో బహుశః పెద్దదేమో...''

ఒక రోజున ఆ పెద్దావిడని వెంటపెట్టుకుని నా దగ్గరకు వచ్చింది.

"మీ వల్ల నాకు సహాయం కావాలి.''

"చెప్పండి.''

"పాపని స్కూల్లో జేర్పిస్తున్నాను. పాపతోబాటు తల్లి దండ్రులు కూడా ఇంటర్వ్యూకి రావాలిట!''

ఈవిషయం నాతో ఎందుకు చెబుతోందో నాకు అర్థం కాలేదు.

"దీంట్లో నేను చేయగలిగిన సహాయం ఏముంది?''.....

ఆవిడ ఏం మాట్లాడలేదు. వెంట వచ్చిన పెద్దావిడ మాట్లాడింది. ఆవిడ మాటలు విన్న తరువాత నేను ఎటువంటి అడ్డంకి చెప్పలేదు.

మర్నాడు వాళ్ళతో కలసి స్కూలుకు వెళ్ళాను. ఆ పసిపాప పేరు చంద్రిక.

అప్లికేషన్‌లో తండ్రి అన్నచోట నా పేరు రాశాను. సంతకం పెట్టాను. గార్డియన్ ఆవిడ తన పేరు రాసి సంతకం పెట్టింది.....

మేం ఎవరం ఏమీ మాట్లాడుకోలేదు. ఎవరి యిళ్ళకు వారు వెళ్ళిపోయాం. తరువాత వారం రోజులకి యీ వూరు వచ్చి స్థిరపడ్డాను.''

"మీ నిర్ణయానికి నేను కారణం వూహించవచ్చునా?''

ఆవిడ కాయితం,కలం తీసుకుని ఏవో లెక్కలు చేసింది. చివరకు ఆయన వంక చూసింది. ఆ చూపులో ఎంతో ఆత్మసంతృప్తి, ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నాయి.

" సామూహిక మానభంగం,ఫలితం ఆ పసిపాప. తండ్రి ఎవరైనా కావచ్చును. కాని ఎవరో తెలియదు. ఆ నీచులలో ఏ ఒక్కరి పేరు పెట్టడం ఆ అమ్మాయికి యిష్టం లేదు. అందుకని తన బిడ్డకు యీ బుష్యశృంగుడిని తండ్రిగా

అమ్మాయికి యిష్టం లేదు. అందుకని తన బిడ్డకు యీ ఋష్యశృంగుడిని తండ్రిగా కోరుకుంది. అంతేనా?''......

ఆవిడ వంక ఆశ్చర్యంగా చూసి "ముమ్మాటికీ అంతే..... నూటికి నూరు పాళ్ళూ నిజం !!....." అని అన్నాడు.

ఆవిడ చిరునవ్వుగా "యీ దాశరధికి యింకో కప్పు కాఫీ యివ్వనా'' అని అంది.